క్లుప్తంగా

రైతు భరోసా పథకం వివరాల ప్రదర్శన

గండేపల్లి: ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా పథకం వివరాలను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి సద్గురుమూర్తి సోమవారం తెలిపారు. పథకానికి అర్హత కలిగి నమోదు కాకపోతే ఈ నెల 18 లోపు సంబంధిత ఆర్బీకేల వద్ద వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు. అధార్, పట్టాదారు, 1బీ, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను అందజేయాలన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం అన్నారు. మండపం గ్రామంలో సోమవారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తొలగించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాణిక్యం మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు శ్రద్ధ వహించాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్

తుని రూరల్: ప్రభుత్వం పథకాలను అర్హులందరికీ అందించాలని ఎంపీడీఓ పీఏఎస్ఈసీ విద్యాసాగర్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితర శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పథకాల అమలు తీరు, వేసవిలో తాగునీటి సరఫరా, మనబడి నాడు–నేడు పనులలో ప్రగతి, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, వివిధ పథకాలలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాల ప్రగతిపై ఎంపీడీఓ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయడంలో వెనుకబడే అధికారులను, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ, ఎంఈఓ పరవాడ గీతాదేవి, ఏసీడీపీఓ నిహారిక, సచివాలయ ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కార్మిక మహాసభల విజయవంతానికి పిలుపు



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మికులు, నాయకులు

తుని రూరల్: అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 25న జరిగే అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయర్లా) ఐదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.జనార్దన్ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ఎస్‌వీ నగరంలో తుని ప్రాంత నాయకుల సమావేశం జరిగింది. గ్రామ సచివాలయం వద్ద కొంత సేపు వ్యవసాయ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం, కార్మిక చట్టాల సంరక్షణ కోసం రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఎస్ఎస్ వెంకటాపురంలో దళితులు, బీసీలు, ఓసీలు ఎన్నో ఏళ్లగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు వాడబోయిన శివ, చేదులూరి రామారావు, దండా చినఅప్పన్న, మోర్త మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాదయాత్ర

జగ్గంపేట, గండేపల్లి, తుని: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సోమవారం జగ్గంపేటలో పాదయాత్ర ప్రారంభించారు. గండేపల్లి మండలం తాళ్లురులో జియ్యన్న ఆలయం వరకు కొనసాగింది. తునిలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో యనమల దివ్య పర్యవేక్షణలో పాదయాత్ర చేపట్టారు.

ప్రచారం ప్రారంభం

ప్రత్తిపాడు: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ తొలిసారిగా ప్రచారం నిర్వహించారు. పెదశంకర్లపూడిలోని స్వగృహం నుంచి సోమవారం ర్యాలీగా అన్నవరం వరకూ వెళ్లారు. ఆమె మాట్లాడుతూ తన భర్త వరుపుల రాజా ఆశయ సాధనకు, టీడీపీ విజయానికి పాటుపడతానని అన్నారు.

అమ్మో.. భగభానుడా..

ఏలేశ్వరం: ఎండ మండించింది.. అమ్మో! భగ'భానుడా' అనేలా నిప్పులు చెరిగింది. సోమవారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో చాలాచోట్ల 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేడి గాలుల కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రం కావడంతో అంతా ఇబ్బంది పడ్డారు. ఏలేశ్వరంలో నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం రోడ్, హనుమాన్ జంక్షన్, లింగంపర్తి రోడ్ జనం లేక వెలవెలబోయాయి.

గోకవరం : గోకవరం మండలంలో భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. గోకవరంలో 47 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నిప్పులు కురిపించినట్టుగా వేడిగాడ్పులు వీచాయి. భానుడి ప్రతాపానికి గోకవరం వారపు సంత సైతం వెలవెలబోయింది. దేవీచౌక్, రమా సత్యనారాయణ స్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ల వద్ద దాతలు చలివేంద్రం ఏర్పాటు చేసి దాహార్తి తీర్చారు.



ఏలేశ్వరంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి



గోకవరంలో వెలవెలబోతున్న రోడ్డు

ఆమెదే అగ్రస్థానం

- దిగ్విజయంగా మహిళా చేయూత మార్ట్‌లు
- రూ.లక్షల్లోనే వ్యాపారం
- రాణిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

కిర్లంపూడి: మహిళా లోకం... వారిది ఉక్కు సంకల్పం. ఆశయానికి ఆచరణ జోడించి చక్కని ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు.. కలల లోకాన్ని ఆవిష్కరిస్తున్నారు.. ఆమెదే అగ్రస్థానం అనేలా దూసుకుపోతున్నారు.. ప్రభుత్వ సహకారానికి తోడు సంకల్ప బలంతో తమదైన శైలి ప్రదర్శిస్తున్నారు. చేయూత మహిళా మార్టుల నిర్వహణ ద్వారా దిగ్విజయంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. చిన్న చితక పొదుపు ద్వారా డబ్బులు దాచుకునే మహిళలు నేడు మార్టులకు అధిపతులు అయ్యారు. వ్యాపారాలంటే మగవారికే అనే మాటకు చరమగీతం పాడారు. తమకు సాటి లేరని నిరూపిస్తున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు చిన్న మొత్తంతో వ్యాపారం మొదలుపెట్టి దాన్నే రూ.లక్షల్లో ఆదాయానికి తీసుకెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో జిల్లాలో పొదుపు సంఘం మహిళలు ఇప్పటి వరకు 4 చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశారు. సెర్ప్ చొరవతో ప్రైవేట్ సంస్థలతో మాట్లాడి సరకులను కొనుగోలు చేస్తూ వ్యాపారంలో రాణిస్తున్నారు. కిర్లంపూడి మండంలోని మొత్తం 2,076 స్వయం సహాయక సంఘాల్లో 20,760 మంది సభ్యులు ఉన్నారు. సెర్ప్, చేయూత, విభాగ సహాయంతో పొదుపు మహిళలు గత మార్చి 31న కిర్లంపూడిలో చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో సభ్యురాలి నుంచి వాటాగా పెట్టుబడి పెట్టి రూ.41.52 లక్షలతో మార్ట్‌ను ఏర్పాటు చేశారు.



మార్టులో పనిచేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

నెల రోజులకే మంచి ఫలితాలు

ఈ మార్ట్ ఏర్పాటు చేసిన తొలి రోజు నుంచి రోజుకు సుమారు రూ. 80 వేల నుంచి రూ.85 వేల టర్నోవర్ జరుగుతోంది. నెల రోజుల్లో రూ. 25,87000 వ్యాపారం జరిగింది. వ్యాపారంలో పెట్టుబడి పోను రూ.2,22,000 నెలలో మార్ట్ ఆదాయం గడించింది. మార్ట్‌లో ఎనిమిది మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున ఎనిమిది మందికి రూ. 48 వేలు, నెల కరెంట్ బిల్లు రూ. 9 వేలు తీసేయగా సుమారు రూ.1,65,000 మార్ట్ ఆదాయాన్ని అందుకొంది.



కిర్లంపూడిలో మార్ట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు (ఫైల్)

మార్ట్ నిర్వహణ ఇలా..

మార్ట్ నిర్వహణ అంతా పొదుపు సంఘాల సభ్యులదే. కిర్లంపూడి చేయూత మహిళా మార్ట్‌పై జీఎస్టీ, ఫుడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ చేసుకుని వ్యాపారం మొదలు పెట్టారు. పది మంది సభ్యులతో కలిపి కమిటీ ఏర్పాటు చేశారు. చీఫ్ ప్రమోటర్‌తో పాటు 9 మంది ప్రమోటర్లు ప్రతి రోజు బాధ్యతగా పర్యవేక్షిస్తున్నారు. చీఫ్ ప్రమోటర్ ఆధ్వర్యంలోనే లావాదేవీలన్నీ సాగుతాయి. వారికి సహకరించేందుకు మార్ట్‌లో మేనేజర్, సహాయ మేనేజర్ లెక్కలు చూస్తారు.

మరిన్ని మార్ట్‌లకు శ్రీకారం



ప్రతి మహిళా స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా మార్ట్ ప్రోగ్రాం మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పటికే జిల్లాల్లో నాలుగు మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశాం. మార్ట్‌లో తక్కువ ధరతో నాణ్యమైన వస్తువులు లభ్యం కావడంతో వినియోగదారుల ఆదరణ పెరిగింది.
–శ్రీరమణి, క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్, కాకినాడ

సమానంగా లాభాలు



మార్ట్ లావాదేవీలపై ఏడాదికొకసారి ఆడిట్ నిర్వహిస్తాం. మార్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పెట్టుబడి పెట్టిన ప్రతి పొదుపు మహిళలకు సమానంగా పంచుతాం. ప్రస్తుతం నిర్వహిస్తున్న మార్ట్‌ను మరింత పెద్దగా చేసేందుకు కృషి చేస్తున్నాం. మంచి ప్రగతి సాధించేలా బాటలు వేస్తున్నాం.
–ఇనకోటి శ్రీనివాసరావు, ఏపీఎం, కిర్లంపూడి

చాలా ఆనందంగా ఉంది



గ్రామీణ ప్రాంతాలకు చెందిన మేము మార్ట్‌లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది. నా తోటి సంఘ సభ్యుల సహాయ సహకారాలతో మార్ట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాను. ఈ మార్ట్ ద్వారా ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తున్నాను.
–పెట్ల ఎస్తేరు రాణి, చేయూత మహిళా మార్ట్ చీఫ్ ప్రమోటర్, కిర్లంపూడి

నేడు మండల పరిషత్తు సమావేశం

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్తు సమావేశ హాలులో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీపీ తోట రవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తారన్నారు.

రేపు గోకవరంలో..

గోకవరం: స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరై మండలాభివృద్ధిపై చర్చించాలన్నారు.

కోటనందూరులో అన్నదానం

కోటనందూరు: స్థానిక తుని– నర్సీపట్నం రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీతలుపులమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరిగింది. గ్రామ పెద్దలు, ప్రజల ఆర్థిక సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పలు గ్రామాల్లో..

రౌతులపూడి: హనుమాన్ జయంతి సందర్భంగా ఎ.మల్లవరం, బలరామపురం గ్రామాల్లో సోమవారం అన్న సమారాధనలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో ప్రజల ఆర్థిక సహాయంతో ఈ అన్నదానాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

చదివిస్తూ... శిక్షణ ఇస్తూ..

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

ఏలేశ్వరం: చదివిస్తూ.. వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తూ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోమిరెడ్డి రాజశేఖర్ విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము చిత్రలేఖనంలో మెలకువలు నేర్పారు. ఉపాధ్యాయుడు శిడగం నాగేంద్ర కథలు వినిపించడం, చదివించడంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరు కావాలన్నారు.



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్

అడ్డుగాపెట్టి.. ఆదాయానికి గండి కొట్టి

కోటనందూరు: రోడ్డుపై కొందరి ఇష్టారాజ్యం ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది.. స్థానిక ఆర్టీసీ బస్ షెల్టర్‌కు అడ్డంగా ఆటోలను నిలుపుతుండడంతో ప్రయాణికులకు అసౌకర్యంతో పాటు ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. గతంలో బస్ షెల్టర్‌ను చిరు వ్యాపారులు ఆక్రమించి ప్రయాణికులకు నీడ లేకుండా చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యను సృష్టించేవారు. ఇటీవల రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించి షెల్టర్‌ను ఖాళీ చేయించి ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఇప్పుడు స్థానిక ఆటోవాలాలు ఖాళీ చేయించిన షెల్టర్ ఎదురుగా తునికి వెళ్లే సీరియల్ ఆటోలను నిలిపి అక్కడే తిష్ట వేస్తున్నారు. ఇలా ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కోటనందూరులో బస్ షెల్టర్‌కు ఎదురుగా నిలిపిన ఆటో

ఎంపీడీఓల శిక్షణ పునః ప్రారంభం

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓలుగా ఎంపికైన 40 మందికి స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో శిక్షణ సోమవారం పునఃప్రారంభమైంది. వీరికి ఈ నెల 1న శిక్షణ మొదలైంది. ఇటీవల నాలుగు రోజుల సెలవుల అనంతరం ఈ శిక్షణ తిరిగి ప్రారంభమైంది. వివిధ అంశాలపై ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, జీవీ శ్రీదేవి, వెంకటేశ్వరావు, బి.ఆంజనేయులు, పి.ప్రసాద్ శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, మండల పరిషత్ సమావేశాలు, బడ్జెట్ తయారీ, అత్యవసర పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, జీఓలపై వీరికి అవగాహన కల్పిస్తున్నారు. వీరికి ఆరు నెలల పాటు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే వీరు బాపట్ల ఈటీసీలో నెల రోజుల పాటు శిక్షణ పొందారు. ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. అనంతరం వారికి ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా శిక్షణ ఇస్తారు. తరువాత శ్రీకాళహస్తి ఈటీసీలో మరో నెల రోజుల పాటు శిక్షణ ఉంటుంది. బాపట్లలో కూడా మలి విడత శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం మరోసారి ఆయా జిల్లాల్లో వీరు క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందుతారు. సెప్టెంబర్‌లో నెల రోజుల పాటు ఈటీసీలో తుది శిక్షణ ఉంటుంది.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామి వారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో పాటు ఏకాదశి పర్వదినం, పిల్లలకు సెలవులను పురస్కరించుకొని తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తొలి అభిషేకం, తొలి పూజలు చేశారు. తొలి పూజను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో చేశారు. వాటిని తిలకించడానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లతో పాటు ఉప ఆలయాలోని దేవతామూర్తులకు అలంకరణలు చేశారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

కొత్తపల్లి: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన దడాల జ్యోత్స్న 589 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలవడంతో రమణక్కపేటలోని ఆమె స్వగృహం వద్ద సోమవారం ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమెకు రూ.10 వేలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా తయారయ్యాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని అన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను ఉన్నత స్థాయి స్థితికి తీసుకువెళ్లడమే లక్ష్యంగా సౌకర్యాల కల్పన జరుగుతుందన్నారు. దీనితో ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి లోడా అప్పలరాజు పాల్గొన్నారు.

కొత్తగా కాంతులీని

- సుందరీకరణ దిశగా అడుగులు
- ప్రధాన రహదారుల్లో ఎల్ఈడీ వెలుగులు
- మారుతున్న పట్టణ రూపురేఖలు

తుని: ప్రగతి పట్టాలెక్కింది.. తుని పట్టణం సుందరీకరణ దిశగా పరుగులు తీస్తోంది.. మౌలిక సదుపాయాలతో పాటు ఆహ్లాదం, వినోదం, క్రీడల్లోనూ ప్రత్యేక చాటేందుకు సిద్ధమవుతోంది.. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి పట్టణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు అందిస్తున్న సహకారం ఇతోధికంగా దోహదపడుతోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోంది.



తుని జీఎన్‌టీ రోడ్డులో ఎల్ఈడీ కాంతులు

వెలుగులు.. జిలుగులు

పట్టణ ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ దీపాలు రకరకాల రంగుల్లో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి రైల్వే ఫ్లెఓవర్, జీఎన్‌టీ రోడ్డు, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో రూ.5 లక్షలతో ఎల్ఈడీ దండలను సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు ఏర్పాటు చేశారు. పగలు సాధారణంగా కనిపించినా రాత్రి సమయాల్లో పలు వర్ణాల్లో నూతన శోభను సంతరించుకున్నాయి. విద్యుత్ వెలుగుల్లో రోడ్లు మెరిసిపోతున్నాయి. వాహనచోదకులు కొత్త అనుభూతికి గురవుతున్నారు.

అందివచ్చిన స్కేటింగ్ ట్రాక్

స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన స్కేటింగ్ పార్కు పిల్లలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. కాకినాడ ఎంపీ గీత, మంత్రి దాడిశెట్టి రాజా కృషితో రూ.45 లక్షలతో ట్రాక్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు స్కేటింగ్ ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. స్కేటింగ్ నేర్చుకోవాలన్న తపన ఉన్నా ఇప్పటి వరకూ ట్రాక్ లేకపోవడంతో యువత ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడు స్థానికంగా అందుబాటులోకి రావడంతో వందలాది మంది పిల్లలు స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. పురపాలక సంఘం తరఫున కోచ్‌ను ఏర్పాటు చేశారు.



తుని మున్సిపల్ పార్కులో స్కేటింగ్ ట్రాక్‌లో చిన్నారులు

జలకాలాటల కోసం..

పట్టణంలో చిన్నారులకు స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి దాడిశెట్టి రాజా అధికారులను ఆదేశించారు. పురపాలక సంఘం పరిధిలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ చేయాలని సూచించారు. ఇది కూడా అందుబాటులోకి వస్తే చిన్నారుల ఆనందానికి అవధులు ఉండవు. పట్టణానికి ఇలా కొత్త కొత్తగా అన్నీ ఒనగూరుతున్నాయి.

ఆహ్లాదాన్ని పంచేందుకు..

నిత్యం పని ఒత్తిడితో సతమతం అయ్యే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే రెండు పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాం. పిల్లలకు స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నాం. ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ కాంతులు అందరినీ ఆకట్టుకున్నాయి.
–ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, తుని

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నాగులాపల్లి గ్రామానికి చెందిన కూనిశెట్టి రాజశేఖర్ రెడ్డి (27)ఈ నెల 6వ తేదీన ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌రెడ్డికి గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవరత్నాలపై దృష్టి సారించాలి

సామర్లకోట: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రీసోర్సు పర్సన్లు (ఆర్పీలు) నవరత్నాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రీసోర్సుపర్సన్ ఎల్.జయరాజ్ అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం(టీటీడీసీ)లో మున్సిపాలిటీ పరిధిలోని 45 మంది ఆర్పీలకు మొదటి రోజు శిక్షణను ఆయన ప్రారంభించారు. నవరత్నాలలోని పథకాలను ఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన నవరత్నాలు అర్హులకు అందే విధంగా చూడాలన్నారు. చేయూత, ఆసరా, జగనన్న తోడు పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి సాధించడం ద్వారానే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందని చెప్పారు. దీనిలో భాగంగా మెప్మా కార్యకలాపాలపై ప్రతీ ఆర్పీ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, సీఓలు ప్రసాద్, నరేష్, ఈశ్వర సంతోష్, ఆర్పీలు పాల్గొన్నారు.



సామర్లకోట టీటీడీసీలో శిక్షణకు హాజరైన ఆర్పీలు